తాగునీటి పథకానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- అరకులోయరూరల్: మండలంలోని లోతేరు పంచాయితీ శిరసగుడ గ్రామంలో శనివారం జల్ జీవన్ మిషన్ పథకం నిధుల ద్వారా తాగునీరు ట్యాంక్ నిర్మాణానికి స్థానిక సర్పంచ్ గుబాయి కళావతి భూమి పూజ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, గతంలో గ్రామంలో తాగునీరు లేక తీవ్ర ఇబ్బంది పడేవారన్నారు. ట్యాంక్ ఏర్పాటు చేసి తాగునీరు అందే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్

ఏజెన్సీలో కాఫీ ఉత్పత్తిపై అధ్యయనం

- ఇన్వెస్ట్ ఇండియా బృందం సభ్యులు - పాడేరు, జి.మాడుగుల, అరకులో పర్యటన

పాడేరులో బృందం సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు : ఒన్ డిస్ట్రిక్ట్ – ఒన్ ప్రొడక్ట్ అధ్యయనానికి దేశంలోని అన్ని జిల్లాలలో వివిధ బృందాలు పర్యటిస్తున్నాయని, తమ బృందం విశాఖపట్నంలో చేపల ఉత్పత్తి, కాఫీ ఉత్పత్తిపై అధ్యయనం చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని ఇన్వెస్ట్ ఇండియా బృంద సభ్యులైన సౌమ్య, ఆకాంక్ష తెలిపారు. ఒక జిల్లా ఒక పంట (వన్ డిస్టిక్ వన్ ప్రొడక్ట్) అనే అంశంపై అధ్యయనం చేయడానికి ఢిల్లీ నుండి వచ్చిన ఇన్వెస్ట్ ఇండియా బృందం సభ్యులతో శనివారం ఐటిడిఎ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,కాఫీ రైతులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నామని ఇన్వెస్ట్ ఇండియా బృంద సభ్యులైన సౌమ్య, ఆకాంక్షలకు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ చెప్పారు. దేశంలో మిగిలిన ప్రాంతాల కన్నా ఇక్కడి పరిస్థితులు విభిన్నమని, ఇక్కడి గిరిజనులు కాఫీ పంటను సాంప్రదాయ పద్ధతిలో పండిస్తారన్నారు., పాడేరు డివిజన్లో 11 మండలాల పరిధిలో సుమారు 2.58 లక్షల ఎకరాల్లో కాఫీ సాగుతో 2.46 లక్షల మందికి లబ్ధి చేకూరుతుందని వివరించారు. అరకు కాఫీ బ్రాండ్ పేరుతో కాఫీ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందన్నారు.

ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ మాట్లాడుతూ కాఫీ సాగు ఎలా మొదలైంది, ఎలాంటి ప్రోత్సాహం అందిస్తున్నది, గిరిజనులకు అందుతున్న ప్రయోజనాలు, వారికి అందిస్తున్న యంత్రాలు, వారికి కల్పిస్తున్న మార్కెట్ సౌకర్యాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్లో వివరించారు. ఇటీవల బెంగళూరులో జరిగిన అంతర్జాతీయ కాఫీ కాన్ఫరెన్స్‌లో అరకు కాఫీకి అవార్డు వచ్చిందని, కాఫీ పంటలో ఉత్తమ రైతు అవార్డు పొందిన పెదబయలు మండలం లక్ష్మీపురం పంచాయతీ కప్పడ గ్రామం రైతు కిల్లో యశ్వనిని బృంద సభ్యులకు పరిచయం చేశారు. అనంతరం స్టాల్స్ పరిశీలించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కే శివ శ్రీనివాస్, ఐటీడీఏ పీవో వి అభిషేక్, ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారులు ప్రభాకర్, ఎం.వెంకటేశ్వరరావు, కాఫీ బోర్డ్ డిడి రమేష్ పాల్గొన్నారు.

కాఫీ మ్యూజియం సందర్శన

అరకులోయ: ఇన్వెస్ట్ ఇండియా బృందం సభ్యులు శనివారం అరకులోయ లోని కాఫీ మ్యూజియంను సందర్శించారు. సుంకరమెట్ట కాఫీ తోటలను పరిశీలించారు. అరకు వ్యాలీ కాఫీ అద్భుతంగా ఉందని బృందం సభ్యులు సౌమ్య అన్నారు. కాఫీ మ్యూజియంలో కాఫీ జర్నీ వివరాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కాఫీ డిడి రమేష్ పాల్గొన్నారు.

జి.మాడుగులలో పర్యటిస్తున్న బృందం సభ్యులు

కాఫీ యూనిట్ పరిశీలన

జి మాడుగుల: ఇన్వెస్ట్ ఇండియా బృందం మండలంలోని ఎం.నిట్టాపుట్టు గ్రామాన్ని సందర్శించి కాఫీ పల్పింగ్ యూనిట్‌ను పరిశీలించారు. నిర్వాహకులతో మాట్లాడి కాఫీ పల్పింగ్ విధానంపై అడిగి తెలుసుకున్నారు. కాఫి సాగు, దిగుబడి, మార్కెటింగ్ సదుపాయాలపై ఆరా తీశారు. ముందుగా గిరిజన రైతులు గిరిజన సంప్రదాయంలో ఘనంగా స్వాగతం పలికారు. బృందం సభ్యులతో కాఫీ బోర్డ్ డిడి రమేష్, జి.సి సి డిఎం సింహాచలం తదితలు పాల్గొన్నారు.

గొందుపాలం అటవీ ప్రాంతంలో పరిశీలిస్తున్న ఎస్ఐ రామకృష్ణ, పోలీసులు

గంజాయి సాగుపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం దారకొండ, గుమ్మరేవులు పంచాయితీల పరిధిని గ్రామాల్లో గంజాయి సాగుపై స్థానిక ఎస్సై రామకృష్ణ ప్రత్యేక దృష్టి సారించారు. శనివారం గొంది పొలము అటవీ ప్రాంతాల్లో స్పెషల్ పార్టీ పోలీసు బలగాలతో గాలింపు చర్యలు చేపట్టారు. గంజాయి సాగు ఏయే ప్రాంతాల్లో జరుగుతుందని గిరిజనులను అడిగి ఆరా తీశారు. దట్టమైన అటవీ ప్రాంతం కొండల నడుమ అత్యాధునిక డ్రోన్ కెమెరాలను ఉపయోగించి గంజాయి సాగు పసిగట్టే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. గంజాయి అక్రమ రవాణాకు ఎవరైనా పాల్పడుతున్నారా? స్మగ్లర్లకి సహకరిస్తున్నారా? అని గిరిజన యువతకు అడిగి తెలుసుకున్నారు. గంజాయి సాగు, అక్రమ రవాణా చట్టరీత్యా నేరమని, అటువంటి వారు ఎవరైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఎస్సై రామకృష్ణ కోరారు.

మన్యంలో బంతిపూల సీజన్ ఆరంభం

- పాడేరు కేంద్రంగా రెండు మాసాలు బంతిపూల మార్కెట్ - ఇతర రాష్ట్రాలకు, జిల్లాలకు ఎగుమతి

ప్రజాశక్తి-పాడేరు: ఏజెన్సీలో బంతిపూల సీజన్ ఆరంభ మయ్యింది. గత కొన్నేళ్లుగా పాడేరు కేంద్రంగా బంతిపూల మార్కెట్ జరుగుతున్న సంగతి విధితమే. గిరిజన రైతులకు కాసుల వర్షం కురిపిస్తున్న మన్యం బంతిపూలకు మంచి గిరాకీ ఉంది. ఒక గంప బంతిపూలకు రూ.100 నుంచి 120 ధర

రైతులకు లభిస్తుంది. వ్యాపారులు ప్రతిరోజు మార్కెట్లో ఉండే డిమాండ్‌ను బట్టి బంతిపూలకు తగిన ధర అందిస్తున్నారు. గిరిజన రైతుల నుంచి ఏటా పెద్ద ఎత్తున బంతిపూలను కొనుగోలు చేస్తున్న వ్యాపారులు ఇతర రాష్ట్రాలకు ఇతర జిల్లాల మార్కెట్లకు బంతిపూలను ఎగుమతి చేస్తున్నారు. ప్రతి ఏడాది శీతాకాలంలో పాడేరు కేంద్రంగా రెండున్నర మాసాలు బంతిపూల మార్కెట్ సాగుతోంది. గిరిజనులకు లాభసాటిగా ఉండడంతో పురుషులు, మహిళలు సైతం బంతిపూల సాగును విరివిగా చేస్తున్నారు. దీంతో పాడేరు హుకుంపేట, జి.మాడుగుల, పెదబయలు మండలాల పరిధిలోని పరిసర గ్రామాల్లో గిరిజనులు బంతిపూల సాగును విస్తరించారు.రోజు ఉదయం, సాయంత్రం కూడా బంతి పూల మార్కెట్ జరుగుతోంది. దసరా నవరాత్రులు

మొదలుకొని కార్తీకమాసంలో మార్కెట్లలో మన్యం బంతి పూలకు మంచి డిమాండ్ లభిస్తుంది. భవాని, అయ్యప్ప మాల ధారణ భక్తులు ఈ బంతిపూలను విరివిగా పూజలకు భజనలకు వినియోగిస్తున్నారు. అలాగే షాపింగ్ మాల్స్, వస్త్ర దుకాణాలు, వాహనాలకు ప్రత్యేక అలంకరణకు ఈ బంతిపూలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. బంతిపూలకు ఉన్న డిమాండ్‌ను బట్టి రైతులు తమ తమ పొలాల్లో అంతర పంటగా కూడా బంతిపూలను సాగు చేస్తున్నారు. మన్యంలో పండించే పలు రకాల బంతిపూలకు లభిస్తున్న ఆదరణ వల్ల ఇటు రైతులకు అటు వ్యాపారులకు కూడా బంతిపూలు కాసులు కురిపిస్తున్నాయి.

బాధితురాలు దూబి సోమిదికి నగదు అందజేస్తున్న పాసి సతీష్

కాంట్రాక్టు కార్మికుని నిజాయితీ

దొరికిన డబ్బులు బాధితునికి అందజేత

ప్రజాశక్తి- మోతుగూడెం

చింతూరు మండలం, మోతుగూడెం ఏపీ జెన్కో జల విద్యుత్ కేంద్రంలో కాంట్రాక్టు కార్మికునిగా పని చేస్తున్న పాసి సతీష్ (రాజా) తనకు దొరికిన డబ్బులు బాధితురాలికి అందజేసి తన నిజాయితీని చాటుకున్నారు. పాసి సతీష్ రెండు రోజుల క్రితం లక్ష్మీ గణపతి దేవాలయం రహదారిలో వెళ్తుండగా, రోడ్ మీద రూ.14,000 నగదు కనబడింది. ఆ నగదు తీసుకొని వివరాలు సేకరించి దొరికిన నగదు తోటి కార్మికురాలు ధూబి సోమిదిగా గుర్తించారు. ఆ దొరికిన డబ్బులు ఆమె ఇంటికి వెళ్లి అందించి మానవత్వం చాటుకున్నాడు. ధూబి సోమి అదే విద్యుత్ సంస్థలో కాంట్రాక్ట్ కార్మికురాలుగా పనిచేస్తుంది. నెల రోజుల పాటు కష్టపడి పనిచేసి వచ్చిన జీతంతో ఇల్లు గడుస్తుందని గంపెడాశలతో ఉన్న ఆమె తీరా చూస్తే నెల జీతం డబ్బులు ఎక్కడో పడిపోయాయి. దీంతో ఆమె రెండు రోజుల నుంచి తిండి తిప్పలు లేక బాధపడుతూ ఉంది. ఈ నేపథ్యంలో దొరికిన డబ్బులను సతీష్ బాధితురాలికి అందించడంతో ఆమె ఆనందం వ్యక్తం చేసింది. తను నెల జీతం డబ్బులు అందించిన పాసి సతీష్‌కు కృతజ్ఞతలు తెలియజేసింది. సతీష్‌ను తోటి కార్మికులు, గ్రామస్తులు అభినందించారు.

మాట్లాడుతున్న జెడ్‌పిటిసి గంగరాజు, రైతులు

ఏకలవ్య పాఠశాలకు భూములివ్వం

- పాతకోట రైతులు

ప్రజాశక్తి -అనంతగిరి: ఏకలవ్య పాఠశాల నిర్మాణానికి తమ జిరాయితీ భూములు ఇచ్చేది లేదని ఉపాధి అవకాశాలతో పాటు ప్రధాన రహదారికి ఆనుకొని ఎక్కడైనా తమకు భూములు కల్పించినప్పుడే అంగీకరిస్తామని లేకుంటే ఇచ్చేది లేదని పాతకోట రైతులు చిటం సింహద్రి, నందుల. దొన్ను, చిటం .బీమన్న, చిటం. గాసి, పాంగి గాసిలు స్పష్టం చేశారు. శనివారం గ్రామంలో ఢిల్లీకి చెందిన ఏకలవ్య పాఠశాల సైట్ ఇంజినీరింగ్ విశ్వనాద్‌తో పాటు స్థానిక జెడ్పిటిసి దీసరి. గంగరాజు సందర్శించారు. అనంతరం రైతులతో కలిసి ఏకలవ్య పాఠశాల ఏర్పాటు విషయంపై రైతులతో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు వారితో మాట్లాడుతూ, భూములు కోల్పోయిన తమకు భూములు కేటిస్తామని, పాఠశాలలోనే ఉపాధి అవకాశాలు కల్పిస్తామని 2021 సంవత్సరంలో స్థానిక రెవిన్యూ జిల్లా ఉన్నతాధికారులు సంబంధిత ఏకలవ్య పాఠశాల యాజమాన్యం తమకు నమ్మ బలి చేసిందని తెలిపారు. రెండున్నర సంవత్సరాలు కావస్తున్నా ఉపాధి లేదన్నారు. తమ సాగు భూములు ప్రభుత్వం ఆధీనంలో తీసుకుందని, తమ భూములు తమకే తిరిగి ఇవ్వాలని లేకుంటే తాము కోరుకున్న చోట భూములు కేటాయించి ఉపాధి అవకాశాలు కల్పించినప్పుడే భూములు ఇవ్వడానికి అంగీకరిస్తామని రైతులు స్పష్టం చేశారు. లేకుంటే ఎట్టి పరిస్థితిలో ఇచ్చేది లేదని అన్నారు

జెడ్పిటిసి రంగరాజు మాట్లాడుతూ, ఏకలవ్య పాఠశాల నిర్మాణానికి రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సాగులో ఉన్న 18 ఎకరాల జిరాయితీ భూములను దానం చేశారన్నారు. ప్రభుత్వం ఆ రైతులకు అన్ని విధాలుగా ఆదుకోవాల్సినప్పటికీ నేటికీ రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ భూమికి భూమి కేటాయించి కుటుంబానికి ఉపాధి అవకాశాలు చూపించవలసి ఉన్నప్పటికీ ఆ దిశగా ప్రభుత్వం చేయలేదన్నారు. ఏకలవ్య పాఠశాల సైట్ ఇంజనీరింగ్ అధికారులు కూడా సంబంధిత ఉన్నత అధికారుల దృష్టికి రైతుల గోడును వినిపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సైట్ ఇంజనీరింగ్ స్థానిక సిపిఎం మండల కార్యదర్శి నాగులు, ఉప సర్పంచ్ పాంగి. అర్జున్, వార్డు మెంబర్ చిట్టం. వెంకటరావు, రైతులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి -హుకుంపేట: చదువులపై మక్కువ చూపించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలికలకు స్థానిక ఎస్సై సతీష్ సూచించారు. మండలంలోని శనివారం స్థానిక బాలికల హాస్టల్ సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మహిళలు విద్యపై పట్టు సాధించి ఉన్నత స్థాయి విద్యా వంతులుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం చట్టాలపై బాలికలకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు విద్యార్థి దశ నుండే అడ్డుకట్టాలన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి -కొయ్యూరు

మండలంలోని మఠం భీమవరం గ్రామ సచివాలయం పరిధిలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని తన దృష్టికి వచ్చిందని, ఆ సమస్య పరిష్కారానికి కచ్చితంగా కృషి చేస్తానని పాడేరు ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి అన్నారు. అయితే నీరు ఎక్కడి నుంచి తెచ్చుకోవాలన్న విషయాన్ని తెలియజేస్తే ఆర్డబ్ల్యూఎస్ అధికారులు, సచివాలయ అధికారులు వచ్చి వాటికి సంబంధించిన ప్రతిపాదన సిద్ధం చేస్తారని చెప్పారు. జల్ జీవన్ మిషన్ పథకం కింద రూ.30లక్షల నిధులు మంజూరయ్యాయని, రహదారి సౌకర్యం లేక రిగ్గు రావడం ఇబ్బందిగా ఉందని, ఆ సమస్య కూడా పరిష్కారం చూపే ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. మఠం భీమవరం గ్రామ సచివాలయం పరిధిలోని జ్యోతులమామిడి, కాకులమామిడి, పుట్టకోట, పెదలంక, మందపల్లి గ్రామాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి 132 గడపలను సందర్శించారు.

మహిళకు కరపత్రాలు అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

గడపగడపకు వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్దిని గణాంకాలతో సహా వివరించారు. గ్రామస్తులు తెలియజేసిన తాగునీరు, పాఠశాల సంబంధించిన సమస్యల పరిష్కారాన్ని కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బి. సువర్ణ కుమారి , ఎంపిటిసి తమర్బ యాదవ్, ఎంపీపీ బడుగు రమేష్ , వైస్ ఎంపీపీ అప్పన్న వెంకటరమణ, వైసిపి నాయకులు సుధాకర్, జల్లి బాబులు, గాడి నాగమణి, రేగటి ముసలి నాయుడు, పలువురు సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

సమస్యలపై ఎంపీ మాధవికి వినతి

ప్రజాశక్తి -కొయ్యూరు

గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని అరకు ఎంపీ గొడ్డేటి మాధవికి విశాఖలోని ఆమె క్యాంపు కార్యాలయంలో పాడేరు నియోజకవర్గానికి చెందిన పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు శనివారం వినతిపత్రం అందజేశారు. దీనికి ఎంపీ మాధవి సానుకూలంగా స్పందించి, త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ప్రభుత్వం ప్రతిష్టాత్మక చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలవుతున్న తీరుపై నాయకులను ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో దేవపురం, వంట్ల మామిడి, ఐనాడ, జర్రెల, వంచుల, సలుగు గ్రామ పంచాయతీల సర్పంచులు కె.పరమేశ్వరి, పాంగి రాంబాబు, ఈశ్వరరావు, వి.నాగరాజు, రాజేశ్వరరావు, అప్పలకొండ, ఐయినాడా, కొయ్యూరు, దామనపల్లి ఎంపిటిసిలు ఎర్రయమ్మ, మల్లికార్జున, భీమారావు, బిఎస్ఎన్ఎల్ అడ్వైజర్ కమిటీ మెంబర్ సందీప్, మాజీ సర్పంచ్ దేముడు, కన్వీనర్లు కృష్ణ, నరసింహ, సత్యారావు, శేఖర్, గృహ సారథులు గంగరాజు, రాజు, వార్డు మెంబర్ పొట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

అరకు ఎంపీ మాధవికి వినతిపత్రం ఇస్తున్న ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు

పరిష్కారం కాని బిఎస్ఎన్ఎల్ సిగ్నల్ సమస్య

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరు పరిధిలో బిఎస్ఎన్ఎల్ సిగ్నల్ సమస్య శనివారం కూడా పరిష్కారం కాలేదు. దీంతో సెల్ సేవలు నిలిచిపోయి వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఒఎఫ్‌సి కేబుల్‌లో సాంకేతిక లోపాలు తలెత్తడం వలన శుక్రవారం సెల్ సిగ్నల్స్ ఆగిపోయాయి. దీనిపై సీలేరు బిఎస్ఎన్ఎల్ టెక్నీషియన్ చక్రిని ప్రజాశక్తి వివరణ కోరగా తమ సిబ్బంది ఓఎఫ్సీ కేబుల్ పరిశీలించగా నర్సీపట్నం సమీపంలో లోతుగడ్డ వద్ద, భద్రాచలం చింతూరు మధ్యలో ఓఎఫ్సీ కేబుల్‌లో సాంకేతిక లోపల ఉన్నట్లు గుర్తించారని తెలిపారు. సాంకేతిక లోపాలు సవరించి సెల్ సిగ్నల్స్, ఫైబర్ నెట్ సౌకర్యం అందుబాటులో వచ్చే విధంగా చర్యలు చేపడతామని ఆయన తెలిపారు.

బైక్ ర్యాలీ చేస్తున్న టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు

బాబు అరెస్టుపై టిడిపి, జనసేన బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-కొయ్యూరు

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టును వ్యతిరేకిస్తూ జిసిసి మాజీ చైర్మన్ ఎంవివి.ప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం కొయ్యూరు నుండి జికె.వీధి మండలం దారకొండ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ దారాలమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జనసేన, టిడిపి నాయకులు గూడెం లక్ష్మణ్, సాగిన బుజ్జిబాబు, పీట సుధీర్ బాబు. అనిశెట్టి నానిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపిలకు తెలుగు యువత మద్దతు

ప్రజాశక్తి-విఆర్.పురం

విఆర్.పురం మండలంలో గ్రామీణ వైద్యుల (ఆర్ఎంపి) సేవలు అధికారులు నిలిపివేసిన నేపథ్యంలో ఆ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆర్ఎంపి వైద్యులకు తెలుగుయువత సంఘీభావం తెలియజేసింది. ఈ మేరకు మండలంలోని రేఖపల్లిలో శనివారం జరిగిన సమావేశంలో తెలుగు యువత రాష్ట్ర నాయకులు బొర్ర నరేశ్ కుమార్ మాట్లాడుతూ ఏజెన్సీలోని మారుమూల గ్రామాల్లో పేదలకు గ్రామీణ వైద్యుల సేవలు ఎంతో అవసరమన్నారు. అధికారులు ఈ అంశాన్ని పరిశీలించాలని కోరారు. ప్రస్తుత పరిస్థితుల్లో రోడ్లు లేని గ్రామాలు ఉన్నాయని, గ్రామీణ వైద్యులు లేకపోతే ఫస్టు ఎయిడ్ చేసేవారు లేరని పేర్కొన్నారు. వారి అవసరాలను గుర్తించి ఆర్ఎంపిల వైద్య సేవలు కొనసాగించాలని కోరారు.

రోగులకు భోజనాలు

ప్రజాశక్తి- అడ్డతీగల

మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో శనివారం మధ్యాహ్నం రోగులకు, వారి బంధువులకు యువకులు భోజన సౌకర్యం కల్పించారు. అడ్డతీగల సినిమాహాల్ కాలనీకి చెందిన యువకులు వారంలో ఒకరోజు అడ్డతీగల హాస్పిటల్‌లో రోగులకు మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పిస్తున్నారు. అందులో భాగంగా శనివారం సుమారు 80 మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో యువకులు బట్టు అశోక్, కురసం చిన్నారావు, సారిక సూర్య, బట్టు సాయి వీరేంద్ర, కంగల నూకరాజు, వేమగిరి గాబెల్, బట్టు కేతన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భోజనం ప్యాకెట్లు అందిస్తున్న యువకులు

పోస్టు కార్డు ఉద్యమాన్ని చేపడుతున్న యుటిఎఫ్ నేతలు

జిపిఎస్ రద్దుకు పోస్ట్‌కార్డు ఉద్యమం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: జిపిఎస్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని కోరుతూ స్థానిక యుటిఎఫ్ ఆధ్వర్యంలో శనివారం పోస్ట్ కార్డు ఉద్యమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు జిపిఎస్ విధానాన్ని వ్యతిరేకించి నిరసన తెలియజేయాలని పిలుపునివ్వడం జరిగిందన్నారు. తక్షణమే ఈ విధానాన్ని రద్దు చేయాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కౌన్సిలర్ ఎస్ కన్నయ్య, కార్యదర్శి మోహన్, మేఘనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలోకి ఆహ్వానిస్తున్న అబ్రహం

పలు గ్రామాల్లో 'బాబుతో నేను'

పెదబయలురూరల్: మండలంలో కొరవంగి పంచాయతీ కొనపుట్టు భీమునివలస, బురుద గుంట, పాత్రుడ తదితర ప్రాంతాల్లో బాబు తో నేను కార్యక్రమాన్ని టిడిపి పార్టీ నేతలు నిర్వహించారు. మాజీ ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు సివేరి అబ్రహం, వైస్ ఎం పి పి పి.సోనే, కె.బాలం నాయుడు, పి.కామేష్, కె.వాసు దేవరావు, ఏ మత్స్య రాజు మాట్లాడుతూ, మాజీ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేశారన్నారు. 100మంది టిడిపి తీర్థం పుచ్చుకున్నారు.

పర్యావరణహిత సాంకేతిక పరిజ్ఞానానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి-మధురవాడ : వ్యవసాయం నుంచి పారిశ్రామిక రంగం వరకు ప్రతి రంగంలోనూ పర్యావరణహిత సాంకేతిక పరిజ్ఞానానికి ప్రాధాన్యత పెరుగుతోందని, ఈ నేపథ్యంలో భవిష్యత్తులో గ్రీన్ జాబ్స్, హరిత సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పరిశ్రమలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ పర్యావరణ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శనివారం జరిగిన వర్క్ షాప్‌లో నిపుణులు అభిప్రాయాలు వెల్లడించారు. వర్క్ షాప్‌ను గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెఎస్.కృష్ణ ప్రారంభించి మాట్లాడారు. పెరుగుతున్న పర్యావరణ సమస్యల కారణంగా పరిశ్రమలు, ఔషధ రంగం, వ్యవసాయ రంగం హరిత సాంకేతిక పరిజ్ఞానం వైపు దృష్టి సారిస్తోందన్నారు. ప్రపంచవ్యాప్తంగా వచ్చిన ఈ మార్పు భవిష్యత్తులో పర్యావరణ నిపుణులకు విస్తృత ఉపాధి మార్గాలతో పాటు స్వయంగా పరిశ్రమల స్థాపించే అవకాశాలను కల్పిస్తోందని అభిప్రాయపడ్డారు.

గీతం పర్యావరణ శాస్త్ర విభాగం సీనియర్ ప్రొఫెసర్ ఎన్.శ్రీనివాస్ మాట్లాడుతూ, గ్రీన్ టెక్నాలజీ స్టార్టప్‌లు, ప్రత్యామ్నాయ ఇందన వనరులు, సర్క్యులర్ ఎకానమీ, సహజ వనరుల నిర్వహణ వంటివి నూతన ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నాయన్నారు. పట్టణ వ్యవసాయం, మిద్దె పంటలు కొత్త తరం వ్యవసాయ నిపుణులను ఆర్థికంగా ఆకర్షిస్తున్నాయని తెలిపారు. పర్యావరణ శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.సురేష్ కుమార్ వాయు కాలుష్యం పెరగడానికి గల కారణాలను విశ్లేషించారు. దేశంలో నీటి కాలుష్య తీవ్రతపై ప్రసంగించిన పర్యావరణ శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎమ్.కిరణ్మయి రెడ్డి 21 శాతం వ్యాధులకు నీటి నాణ్యతాలోపాలే కారణమన్నారు.

104 సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

మాట్లాడుతున్న సిఐటియు నేత ధనుంజయ్

ప్రజాశక్తి: -చింతపల్లి: 104 సిబ్బంది సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని సిఐటియు జిల్లా నాయకులు పాంగి ధనుంజయ్ దుయ్యబట్టారు. శనివారం చింతపల్లి ఎన్జీరంగా విశ్వవిద్యాలయంలోని హాల్ లో అల్లూరి సీతారామరాజు జిల్లా 22 మండలాల 104 సిబ్బంది, ప్రతినిధులతో సిహెచ్ సూర్యనారాయణ పడాల్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ధనుంజయ్ మాట్లాడుతూ, జగనన్న సురక్ష కార్యక్రమాల్లో 104 సిబ్బంది కీలకంగా వ్యవహరిస్తున్నారన్నారు. 104 సిబ్బంది సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కుటుంబాలతో చాలీచాలని వేతనాలతో బతుకుతున్నారన్నారు. 104 ద్వారా ఆరోగ్య సేవలు చాలా బాగా అందిస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుందని, సిబ్బంది కష్టాలు పట్టించుకోలేదన్నారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏవీ కూడా పరిష్కారం చేయకుండా తాత్సారం చేస్తుందన్నారు. కనీస వేతనాలు ఇవ్వకుండా, పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయకుండా ప్రభుత్వం వెట్టిచాకిరి చేయిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 104 వాహనం లో జగన్ మోహన్ రెడ్డి బొమ్మ మాత్రమే కనిపిస్తుంది తప్ప 104 సిబ్బంది కష్టాలు ప్రభుత్వానికి కనిపించని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం 26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. అందుకోసం ప్రభుత్వా అనుబంధంగానే 104 సేవలు నడపాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మూర్తి నాయుడు, ఉపాధ్యక్షులు కే పవన్ కుమార్, ఉప కార్యదర్శి జే.రవిరాజు, కోశాధికారి ఎస్.కె నజీర్, వరప్రసాద్, పి.భీమరాజు, ఏ.అప్పలరాజు పాల్గొన్నారు.

కనీస వేతనాలు చెల్లించాలి

మాతృభాష విద్యా వాలంటీర్ల వినతి

అరకులోయ ఎంఇఒ భారతికి వినతిపత్రం అందజేస్తున్న వాలంటీర్లు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండల పరిధిలో మాతృభాష విద్యా వాలంటీర్లకు కనీస వేతనాలు చెల్లించాలని ఆ సంఘం అధ్యక్షుడు కే గణేష్ కోరారు. మండల కేంద్రంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కల్యాణ మండపం వద్ద సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.చంద్రయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండల పరిధిలో సుమారు 150 మంది మాతృభాష విద్యా వాలంటీర్లు పనిచేస్తున్నామని, వారికి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. ఏప్రిల్ నెల వరకు రెన్యువల్ పెంచాలని డిమాండ్ చేశారు. మాతృభాష భాషా వాలంటరీల బోధనతో విద్యార్థుల డ్రాప్ అవుట్ శాతం తగ్గిందని, ఈ విషయం ప్రభుత్వం గుర్తించి తమ సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. ప్రాముఖ్యంగా ఆదివాసి భాష ఒరియా, కువి, కొండ బాసల నుండి తెలుగు భాషలో తర్జుమా చేసి బోధిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు విద్యా బోధనలు సులువుగా నేర్చుకుంటున్నారన్నారు. ఏజెన్సీ ప్రాంతాలలో అనేక గ్రామాలలో మాతృభాష వాలంటరీలు లేక పోవడంతో విద్యార్థులు తెలుగు బోధనతో సతమతమవుతున్నారని తెలిపారు.ఆయా గ్రామాలను గుర్తించి మాతృభాష వాలంటరీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాతృభాష విద్యా వాలంటరీ జిల్లా కమిటీ సభ్యుడు కే కొండయ్య, మండల అధ్యక్షుడు పి.ప్రకాష్, శ్యామ్, పుణ్యవతి పాల్గొన్నారు.

అరకులోయ: ఆదివాసి మాతృభాషా ఉపాధ్యాయులు అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి 2024 మార్చి, ఏప్రిల్ నెలలో కూడా కొనసాగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదివాసి మాతృభాష ఉపాధ్యాయులు మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ (భారతి)కి శనివారం వినతి పత్రం సమర్పించారు. ఆదివాసి మాతృభాష ఉపాధ్యాయులకు ప్రతి సంవత్సరం రెన్యువల్ చేసి సమాన పనికి సమాన వేతనం కల్పించాలన్నారు. తల్లి భాషను గౌరవించి కొనసాగించాలని, ప్రతి ఏడాది ఆదివాసి మాతృభాష ఉపాధ్యాయులకు బడ్జెట్లో ప్రత్యేకంగా కేటాయించి కొనసాగించాలని సంఘం నాయకులు నాగేంద్ర, నాగేశ్వరరావు, మొంగ్లు, ఆనంద్, తాతబాబు, రమేష్ ,శ్యామ్ ,జోషి, వెంకట్రావు, చంటిబాబు, గాసి, సన్యాసిరావులు డిమాండ్ చేశారు.

నేడు హాల్ టికెట్లు పంపిణీ

ప్రజాశక్తి-పాడేరు: ఐటిడిఎ ఆధ్వర్యంలో అందిస్తున్న ఉచిత సివిల్స్ శిక్షణ రాత పరీక్షకు పరీక్ష కేంద్రాల్లో హాల్ టికెట్లు జారీ చేస్తామని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈనెల 15వ తేదీ సాయంత్రం వరకు ఐటిడీఏ కార్యాలయంలో హాల్ టికెట్లు పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఐటిడిఏ కార్యాలయంలో హాల్ టికెట్లు పొందని అభ్యర్థులు సంబంధిత పరీక్షా కేంద్రంలో హాల్ టికెట్లు పొందువచ్చని చెప్పారు. పాడేరు పరీక్షా కేంద్రాన్ని సూచించుకున్న అభ్యర్థులు 16వ తేదీ ఉదయం ఐటిడీఏ కార్యాలయంలో హాల్ టికెట్లు పొందాలని పేర్కొన్నారు.

నేరాలు ఘోరాలు

గంజాయి సాగు చేస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-పెదబయలురూరల్: మండలంలోని గంపరాయి పంచాయతీ కుల్లుబ గ్రామ శివారు లో గంజాయి సాగు చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ముందస్తు సమాచారం మేరకు ఐదు సెంట్లు విస్తీర్ణం భూభాగంలో గంజాయి సాగు చేస్తున్నట్లు గుర్తించి అతనిపై కేసు నమోదు చేసి, రిమాండ్కు తరలించినట్లు ఎస్సై పి .మనోజ్ కుమార్ విలేకరులకు తెలిపారు

గాయపడిన విద్యార్థి మృతి

ప్రజాశక్తి-అరకులోయ: విద్యుత్ ఘాతంతో గాయపడి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న గిరిజన విద్యార్థి శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మండలంలోని లోతేరు గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న వంతల అప్పలరాజు(13) గత నెల 28న విద్యుత్ ఘాతానికి తీవ్రంగా గాయపడి విశాఖ కేజిహెచ్ లో చికిత్స పొందుతున్న విషయం విషయం తెలిసిందే. పోస్టుమార్టం అనంతరం స్వగ్రామమైన అరకులోయ మండలం గద్యగూడాలో దహన సంస్కరణలు నిర్వహించారు.

కాలువలో పడి బాలుడు మృతి

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి కాలువలో జారిపడి నాలుగేళ్ల బాలుడు మృతి చెందిన ఘటన ఎకెసి కాలనీలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... జివిఎంసి 40వ వార్డు పరిధి ఎకెసి కాలనీలో పెంటకోట వరలక్ష్మి నివాసముంటుంది. నేవల్ పార్కులో కూలి పనిచేస్తోంది. వరలక్ష్మికి నాలుగేళ్ల బాలుడు లకేష్ ఉన్నాడు. శనివారం బాలుడు లకేష్ అంగన్‌వాడీ పాఠశాలకు వెళ్లి తిరిగి వస్తూ మార్గమధ్యలో జివిఎంసి పెద్ద కాలువలో పడిపోయాడు. అదే సమయంలో జివిఎంసి వాటర్ ట్యాంక్ నిండిపోయి కాలువలో ప్రవహిస్తున్న సమయంలో పడి సిమెంట్ దిమ్మలకు కిందకు వెళ్లిపోవడంతో మృతి చెందాడు స్థానికులు గమనించి తల్లి వరలక్ష్మికి, పోలీసులకు సమాచారమందించారు. మల్కాపురం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. బాలుడు మృత దేహాన్ని కెజిహెచ్‌కు తరలించారు. కేసును జిడి.బాబు ఆధ్వర్యాన ఎస్ఐ దేవుడమ్మ దర్యాప్తు చేస్తున్నారు.

కాలం చెల్లిన శీతల పానీయ విక్రయాలు!

- తాగిన మహిళకు అస్వస్థత

ప్రజాశక్తి-ముంచింగి పుట్టు: మండల కేంద్రంలోని వారపు సంతలో కాల చెల్లిన శీతల పానీయాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. శనివారం వారపు సంతలో కూరగాయలు కొనుక్కుని ఇంటికి తిరిగి వెళ్లే క్రమంలో కిరాణా షాపు వద్ద టాటా గ్లూకోస్ శీతాల పానీయంని సర్ని లక్ష్మి అనే మహిళ కొనుక్కొని తాగింది. తాగిన అర్థగంటలో వాంతులు, విరేచనాలు మొదలై అస్వస్థతకు గురైంది. వైద్యులు మెరుగైన వైద్య సేవలు అందించారు.

వారపు సంతలో ఆమ్ ఆద్మీ ప్రచారం

ప్రజాశక్తి-హుకుంపేట: మండలం కేంద్రంలోని వారపు సంతలో ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా ఇంచార్జ్ మొస్య సుజాత సాల్మన్ ఆధ్వర్యంలో పార్టీ సిద్ధాంతాలపై ప్రచారం చేపట్టారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్య ప్రజలను పట్టించుకోలేదన్నారు. గత ఏడు సంవత్సరాలుగా సామాజిక సేవలో ఉన్నానని తెలిపాఉ. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వంతల ప్రసాద్, మహేష్, లక్మి, నాగ లక్ష్మి పాల్గొన్నారు

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: పాడేరు ఐటిడిఏ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్మెంట్ కింద వివిధ కోర్సులో టైలరింగ్, కార్పెంటర్, తాపీ కోర్సుల్లో యువతీ, యువకులకు శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు స్థానిక మండల ఎంపీడీవో సిహెచ్ వెంకటేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 30 వరకు దరఖాస్తులు ఆయా పంచాయతీ కార్యాలయంలో ఆసక్తి కలిగి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న నాగభూషణం

'ఉక్కు'పై అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు అఖిలపక్ష కార్మిక సంఘాల, రాజకీయ పార్టీల నాయకులను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఢిల్లీకి తీసుకువెళ్లి ప్రధానితో చర్చలకు అవకాశం కల్పించాలని ఐఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం విజ్ఞప్తి చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శనివారానికి 924వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఐఎన్‌టియుసి హెచ్‌పిసిఎల్ విభాగం కాంట్రాక్టు వర్కర్లు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి దాదాపు మూడు సంవత్సరాలు కావొస్తోందని, అంతకు మించి ఏ చర్యా తీసుకోలేదని తెలిపారు. ఉక్కుపై మౌనం దాల్చడం శోచనీయమన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి గురించి సిఎం విశాఖపట్నం వస్తున్నారని చెప్పేముందు ఉత్తరాంధ్రలో ఏకైక భారీ పరిశ్రమైన స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా ఏ చర్యలు తీసుకున్నారో చెప్పాల్సిన అవసరముందన్నారు. దీక్షల్లో ఐఎన్‌టియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వై.నర్సింగరావు, ఎస్.తాతబాబు పాల్గొన్నారు.

రుషికొండ స్వాహాకు జగన్ కుట్ర

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రుషికొండను లీజు పేరిట కొట్టేయాలని సిఎం జగన్మోహన్ రెడ్డి చూస్తున్నారని టిడిపి మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి ఆరోపించారు. శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ ప్రతి మీటింగ్‌లో పేదోడని అంటాడని, అక్కడితో ఆగకుండా క్లాస్ వార్ అంటాడని తెలిపారు. పేదోడైన జగన్ బాత్ రూమ్‌కైన ఖర్చు రూ.కోటి, కమోడ్ ఖర్చు రూ.25 లక్షలు, బెడ్ రూమ్ ఖర్చు రూ.40 కోట్లు, వెరసి రుషికొండలో నిర్మాణాలకు ఇప్పటికే రూ.350 కోట్లు ఖర్చు చేశారని ఎద్దేవా చేశారు. జగన్‌కు ఇంత విలాసవంతమైన భవనం అవసరమా అని ప్రశ్నించారు. రుషికొండ లీజు ఎవరికిచ్చారు ? ఎంతకిచ్చారో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు ఆరోగ్యం విషయంలో కోర్టు జోక్యం చేసుకోవాలన్నారు. ఆయన్ని సూపర్ స్పెషాలిటీకి తరలించాలని కోరారు.

వైజాగ్ షార్ట్ ఫిలిం మేకర్స్ ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైజాగ్ షార్ట్ ఫిలిం మేకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి 3 వరకు నిర్వహించిన ఫిలిం డైరెక్షన్ వర్క్‌షాప్‌లో పాల్గొన్న షార్ట్ ఫిలిం కళాకారులు, నగరంలో ఇతర కళాకారులు నేషనల్ ఫిలిం డే సందర్భంగా అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో 'కళాకారుల గెట్ టు గెదర్' పేరిట ఆత్మీయ కార్యక్రమం నిర్వహించుకున్నారు. షార్ట్ ఫిలిం మేకర్స్ అందరికీ అసోసియేషన్ తోడుగా ఉంటుందని, వారి కోసం నిత్యం వర్క్‌షాప్‌లు, ఫిలిం ఫెస్టివల్ వంటివి నిర్వహిస్తామని అసోసియేషన్ కార్యదర్శి ఎల్లాజీ తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు అష్రఫ్, కార్యవర్గ సభ్యులు దిలీప్ కుమార్, ఉమామహేష్, సంతోష్ పాల్గొన్నారు.

పవన్‌పై వ్యక్తిగత దూషణలు తగవు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై సిఎం జగన్మోహన్ రెడ్డి అదే పనిగా వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని, ఇప్పటికైనా వాటికి స్వస్తి చెప్పాలని.. లేకుంటే తగిన గుణపాఠం తప్పదని దక్షిణ నియోజకవర్గం జనసేన నాయకులు పి.శివప్రసాద్ రెడ్డి హెచ్చరించారు. శనివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సిఎం జగన్మోహన్ రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తూ నిరసన తెలిపారు.

విశాఖకు జగన్ రాకపై..

సొంత పార్టీలో తర్జనభర్జన

తాజా పరిస్థితుల్లో అంత ఈజీ కాదని వైసిపిలోనూ చర్చ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఓ పక్క ప్రధాన ప్రతిపక్ష నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును స్కిల్ డవలప్‌మెంట్ కేసులో అరెస్ట్ చేసి జైలులో పెట్టడం, మరోపక్క వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం ఉధృతంగా కార్మిక, ప్రజా పోరాటం సాగుతుండటం, ఇంకో పక్క విశాఖకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మకాం మారుస్తుండటం వంటి అంశాలపై జిల్లా వాసుల్లో ప్రధాన చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో విశాఖకు ఈ దసరాకు జగన్ వచ్చి కూర్చొంటారా ? అంటే అధికార పార్టీ శ్రేణులూ మీనమేషాలే లెక్కిస్తున్నాయి. గతంలో చెప్పినట్టు ప్రస్తుతం నేతలు ఠక్కున జవాబివ్వలేకపోతున్నారు. విశాఖలో క్రైం రేటు... అంటే భూ కబ్జాలు, కిడ్నాప్‌లు, మర్డర్లు, డ్రగ్స్ వ్యవహారాలు వంటివి అధికార పార్టీని గడిచిన కొద్ది నెలల నుంచీ కలవరపెడుతున్నాయి. విశాఖకు రాజధాని కావాలా ? లేదా ? అన్న అంశంపై ప్రజల్లో కనిపిస్తున్న మిశ్రమ స్పందనే ఆ పార్టీలోనూ ప్రస్తుతం కనిపిస్తోంది. మూడేళ్లుగా వైజాగ్ ప్రజానీకం, ఉత్తరాంధ్ర వాసుల ప్రధాన డిమాండ్‌గా విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ అంశం ఉంది. ఇప్పుడు ఉక్కు పోరాటమూ ఉధృతమవుతోంది. అధికార పార్టీ 'ఉక్కు'పై చిత్తశుద్ధితో వ్యవహరించకుండా ఉపరితలంపై విన్యాసాలు చేస్తూ పబ్బం గడుపుకోవడం ఈ ప్రాంత ప్రజలు గుర్తిస్తున్నారు.

విశాఖకు జగన్ వచ్చేనా ?

వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి సిఎం క్యాంపు కార్యాలయం విశాఖకు మార్పు విషయమై ఇటీవల మాట్లాడుతూ 'అక్టోబర్ కావచ్చు...నవంబర్ కావచ్చు' అనడం చూస్తే ప్రస్తుత పరిస్థితుల్లో అంత సులభం కాదన్నది సొంతపార్టీ వారికీ అర్థమైంది. అనుకున్న తేదీకి అటుఇటుగా సిఎం వచ్చి తీరుతారని పలువురు చెప్పుకుంటున్నారు. ఈ క్రమంలోనే సాగర తీరంలో రహదారుల విస్తరణ, రోడ్ల సుందరీకరణ వంటి పనులు రెండు నెలలుగా సాగుతూ ఉన్నాయి. విశాఖలో చేపట్టాల్సిన ప్రాజెక్టులపై రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జవహర్‌రెడ్డి సహా పలువురు ఉన్నతాధికారులు సమీక్షలు జరిపి ఆదేశాలు జారీ చేసి వెళ్లిపోయారు. ఆ పనుల్లో అధికారులు తలమునకలై ఉన్నారు.

రకరకాల ఊహాగానాలు

వారంలో మూడు రోజులు జనంలో తిరిగేందుకు ముఖ్యమంత్రి వైస్ జగన్ రూట్‌మ్యాప్ సిద్ధం చేసుకున్నట్టు తెలుస్తోంది. ప్రజల స్పందన బట్టి విశాఖకు నవంబర్‌లో ఓ దఫా వచ్చి కూర్చొని వెళ్లిపోవాలన్న ప్లాన్ కూడా లేకపోలేదు.

ముఖ్యంగా చంద్రబాబు అరెస్ట్ అయ్యాక ప్రజల్లో ఏమైనా సానుభూతి పవనాలు ఉన్నాయా ? అన్న అంశాలను పరిశీలించాక తుది నిర్ణయం తీసుకోవచ్చు. అయితే తొలి నుంచీ విశాఖే మా రాజధాని అని సిఎం చెప్పినందున లాంఛనంగా వస్తారని పలువురు చెబుతున్నారు. ఈ నెల 16 తరువాత విశాఖలో ఇన్ఫోసిస్ కంపెనీ ప్రారంభమై యువతకు కాస్తయినా ఉపాధి కల్పించే పరిస్థితి కనిపించాక వైజాగ్ మకాం గురించి చూద్దాం అన్న చర్చ కూడా అధికార పార్టీలో నెలకొంది.

జాతీయ క్రీడలకు సాంకేతిక అధికారిగా శర్మ



ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ డివిఎస్‌వై.శర్మ ఈ నెల 26 నుంచి నవంబర్ 2 వరకు గోవాలో జరగబోయే జాతీయ క్రీడలకు సాంకేతిక అధికారిగా నామినేట్ అయ్యారు. బ్లూ బ్యాడ్జ్ అంపైర్‌గా ఉన్న ఆయన ఇటీవల హాంకాంగ్‌లో ముగిసిన ఆసియా ఛాంపియన్‌షిప్‌లో అడ్వాన్స్‌డ్ ఇంటర్నేషనల్ అంపైర్‌గా అర్హత సాధించారు. అంతేకాకుండా ఈ నెల 19 నుంచి 25 వరకు కేరళలోని త్రివేండ్రంలో జరిగే జాతీయ ర్యాంకింగ్ టోర్నమెంట్‌కు బ్లూ బ్యాడ్జ్ అంపైర్‌గా కూడా ఎంపికయ్యారు. ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుంచి నామినేట్ చేయబడిన అంపైర్ శర్మ మాత్రమే. ఆయన ఎల్ఐసిలో హయ్యర్ గ్రేడ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఈ క్రీడలకు అతని ఎంపికపై ఎల్ఐసి ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.వరప్రసాద్, అధ్యక్షులు ఎం.కామేశ్వరి, ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ సభ్యులు, విశాఖపట్నం డిస్ట్రిక్ట్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షులు జెకె.నాయక్ హర్షం వ్యక్తం చేశారు.

యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యంగా అనుసంధాన్ యువ, పల్సస్ గ్రూప్ పనిచేస్తున్నట్టు పల్సస్ గ్రూప్ సిఇఒ డాక్టర్ గేదెల శ్రీనుబాబు తెలిపారు. బీచ్ రోడ్డులోని ఎయు కన్వెన్షన్ హాల్లో డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ కళాశాలల మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్స్, టిపిఒలకు, విద్యార్థులకు ప్రొఫెషనల్ కోర్సులపై అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విశాఖ కేంద్రంగా రాబోయే రెండేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా ఐదు లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా పల్సస్ గ్రూప్ అనుసంధాన్ యువ సంస్థతో ముందుకు వెళుతోందన్నారు. కార్యక్రమంలో అనుసంధాన్ యువ సిఇఒ సుభాష్, రాష్ట్రంలోని ఐదు వందల మంది కాలేజీ ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు, ప్రిన్సిపాళ్లు, యూనివర్సిటీ డీన్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జాలాదికి నివాళి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : తెలుగువారి గొప్పతనాన్ని చాటిచెప్పిన మహోన్నత వ్యక్తి, సినీ పాటల రచయిత జాలాది రాజారావు అని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి కొనియాడారు. జాలాది 12వ వర్ధంతి సందర్భంగా శనివారం బీచ్ రోడ్డులోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సుమారు 250 చిత్రాలకు 1800 పాటలు రాసిన జాలాది తెలుగువాడు, విశాఖ నగరవాసి కావడం గొప్ప విషయమన్నారు. ఆయనకు దక్షిణాదిలోనే కాదు ఉత్తరాదిలో కూడా గొప్ప రచయితగా పేరు ఉందని తెలిపారు. ఆయన రాసిన పాటలు దేశభక్తి, సర్వమత సమానత్వానికి బాగా ఉపయోగపడ్డాయని తెలిపారు. జాలాది స్వాతంత్ర్య సమరయోధులుగానూ ప్రజల గుండెల్లో నిలిచారన్నారు. అనంతరం గ్రేసియస్ ఛారిటబుల్ సంస్థ ఆధ్వర్యాన అనాథ బాలికలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జాలాది విజయ, శ్రీనివాస్, ఆదారి కిషోర్ పాల్గొన్నారు.

పాదయాత్ర నిర్వహిస్తున్న నాయకులు

పంచ గ్రామాల సమస్యపై పాదయాత్ర

ప్రజాశక్తి - పెందుర్తి : పంచ గ్రామాల సమస్యను పరిష్కరించాలంటూ సమైక్య ప్రజా, రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పురుషోత్తపురం నుంచి గోపాలపట్నం పెట్రోల్ బంకు వరకూ శనివారం సాయంత్రం పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి టివి.కృష్ణంరాజు మాట్లాడుతూ దశాబ్దాల తరబడి పంచ గ్రామాల ప్రజలు భూ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పెందుర్తి ఎమ్మెల్యే అదీప్ రాజు గెలిచిన వెంటనే సమస్యను సిఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చి నాలుగున్నరేళ్లు అవుతున్నా అతీగతీ లేదన్నారు. పాలకులు మారుతున్నా సమస్య పరిష్కారం కాకపోవడం వల్ల పంచగ్రామాల ప్రజలు తీవ్ర కష్టాలు పడుతున్నారని తెలిపారు. సిఎం జగన్మోహన్ రెడ్డి విశాఖ వస్తున్నారు.. వెళ్తున్నారు తప్ప సమస్యపై స్పందించడం లేదని మండిపడ్డారు. దసరా నుంచి సిఎం విశాఖ కేంద్రంగా పాలన సాగించనున్నట్టు వార్తలు వస్తున్నాయని, ఇప్పటికైనా స్పందించాలని కోరారు. లేనిపక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు బి.అరుణ్ కుమార్, పి.రామారావు సిహెచ్‌ఎస్.గోపాలకృష్ణ, మాధవరావు, ప్రతాప్, పలు కాలనీల పెద్దలు పాల్గొన్నారు.

డప్పు కళాకారుడు బి.రమణ ఆకస్మిక మృతి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : నగరానికి చెందిన ప్రముఖ డప్పు కళాకారుడు, ప్రజానాట్య మండలి కళాకారుడు బి.రమణ (52) గుండె జబ్బుతో హఠాత్తుగా మరణించారు. శుక్రవారం రాత్రి గుండె జబ్బుతో ఆసుపత్రిలో చేరిన ఆయన చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి కన్నుమూశారు. అల్లిపురంలోని ఆయన గృహానికి పార్థివదేహాన్ని శనివారం తీసుకొచ్చారు. రమణ మరణవార్త తెలియడంతో ప్రజానాట్యమండలి నగర గౌరవాధ్యక్షులు దండు నాగేశ్వరరావు, కార్యదర్శి ఎం.చంటి, కార్యవర్గ సభ్యులు వై.అప్పారావు, కంచరపాలెం జోన్ నాయకులు రాంబాబు, మహేంద్ర, మద్దిలపాలెం జోన్ నాయకులు ఎన్‌వి.రమణ, సిఐటియు జగదాంబ జోన్ సీనియర్ నాయకులు వై.రాజు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె. సంతోష్ కుమార్ తదితరులు అల్లిపురం వెళ్లి రమణ పార్థివ దేహం వద్ద నివాళ్లర్పించారు. మధ్యాహ్నం జ్ఞానాపురం శ్మశాన వాటికలో రమణ అంత్యక్రియలు జరిగాయి. ప్రజా సమస్యలపై విశాఖ జిల్లాలో ప్రజాతంత్ర ఉద్యమాలు జరిగిన ప్రతి సందర్భంలోనూ, అధిక ధరలు, నిరుద్యోగం, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, సామాజిక రక్షణ, కార్మికుల వేతన సమస్యలపై ప్రజానాట్యమండలి ఇచ్చిన ప్రతి పిలుపులోనూ రమణ గతంలో పాల్గొన్నారని ప్రజానాట్యమండలి కార్యదర్శి చంటి తెలిపారు.

సాగరగిరికి నేటి నుంచి బోటు ప్రయాణం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : యారాడ కొండపై వెలసిన శ్రీ సాగరగిరి కనకదుర్గ దేవాలయానికి సముద్ర మార్గంలో వెళ్లేందుకు ప్రతిఏటా మాదిరిగానే ఈ ఏడాదీ ప్రైవేటు బోట్లను నడుపుతున్నట్లు ఆలయ కమిటీ శనివారం ఓ ప్రకటనలో పేర్కొంది. విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌లోని 1, 2 జెట్టీల నుంచి హనుమాన్ దేశం వరకూ బోట్లు నడపనున్నట్టు తెలిపింది. ఆదివారం నుంచి ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు బోట్లు నడుస్తాయని, ఈ అవకాశాన్ని భక్తులు వినియోగించుకోవాలని కోరింది.

ప్రశాంతంగా ఎస్ఐ రాత పరీక్ష

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎపి పోలీస్ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో విశాఖ నగరంలో శనివారం జరిగిన సబ్ ఇన్‌స్పెక్టర్ (సివిల్), రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎపిఎస్‌పి) అభ్యర్థుల మెయిన్స్ పేపర్ - 1, పేపర్ - 2 రాత పరీక్షలు ప్రశాంతంగా సాగాయి. శనివారం ఈ పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.